# చదువు

ఈనాడు
హైదరాబాద్
సోమవారం మార్చి 19, 2018

e-mail: edc@eenadu.in

**ఎంబీబీఎస్/ బీడీఎస్ చేయాలనుకునే ప్రతి విద్యార్థికీ ముఖ్యమైన పరీక్ష నీట్. ఇది మే 6న జరుగుతుంది. ఈ ఏడాది నుంచి రెండు తెలుగు రాష్ట్రాలూ నేషనల్ పూల్‌లోకి వెళ్లడం వల్ల మన రాష్ట్రాల కన్వీనర్ కోటాలోని మెడికల్, డెంటల్ సీట్లలో 15% ఇతర రాష్ట్ర విద్యార్థులకు ఇవ్వాలి. అలాగే ఇతర రాష్ట్రాల్లోని 15% సీట్లకు మన విద్యార్థులు పోటీ పడవచ్చు. ఈ పరిస్థితుల్లో గత సంవత్సరాలకంటే మెరుగ్గా కృషి చేయాల్సిందే!**



# సీటు పట్టేద్దాం... నీట్‌గా!

ఇంటర్ పరీక్షలు పూర్తయి, పోటీపరీక్షల సన్నద్ధత వేగం పుంజుకుంటోంది. బైపీసీ విద్యార్థులు రాసే ముఖ్య పరీక్షలు నీట్, ఎంసెట్. కొంతమంది ఎయిమ్స్, జిప్‌మర్ పరీక్షలు కూడా రాస్తున్నారు. ఎయిమ్స్ మే 26, 27 తేదీల్లో, జిప్‌మర్ జూన్ 3న జరుగుతుంది.

కనీసం 720 మార్కులకు జరిగే ఈ పరీక్షలో 550 మార్కులకుపైగా వస్తేనే.. 2018లో మెడికల్ కళాశాలలో ఎ- కేటగిరీ సీట్లలో చేరే అవకాశం ఉంటుంది. ఈ అవగాహన ఏర్పరచుకుని సరైన ప్రణాళికతో ఈ 45 రోజులు తయారు కాగలిగితే సులభంగా సీటు సాధించుకోవచ్చు. నేషనల్ పూల్‌కి వెళ్లడం వల్ల ఓపెన్ కేటగిరీ విద్యార్థులు నష్టపోతారు కానీ రిజర్వేషన్ (ఎస్సీ, ఎస్టీ) విద్యార్థులకు అదనంగా కొంత మేలు జరుగుతుంది. అంటే వారు ఇతర రాష్ట్రాల్లోని సీట్లను తక్కువ మార్కులకే పొందే అవకాశముంది.

12 లక్షల మంది రాస్తున్న నీట్‌లో 550/720 మార్కులు తెచ్చుకోవాలంటే ప్రతిరోజూ ప్రతి విషయాన్నీ అవగాహన చేసుకుని వెళ్ళాల్సిందే. సబ్జెక్టు వారీ ప్రణాళిక ఎలా ఉండాలో తెలుసుకుందాం! .

## సగభాగం బయాలజీదే!

2018లో జరగబోయే నీట్‌లో బయాలజీ నుంచి మొత్తం 90 ప్రశ్నలు ఉంటాయి. బోటనీ, జువాలజీ సమంగా ఉండాల్సిన అవసరం లేదు. గత రెండేళ్లుగా బోటనీ నుంచి ప్రశ్నలు ఎక్కువ వస్తున్నాయి. కాబట్టి సుమారుగా 50, 40గా తీసుకోవచ్చు. ప్రతి సరైన సమాధానానికీ 4 మార్కులు కాబట్టి బయాలజీలో 360 మార్కులు సంపాదించుకోవచ్చు. 720 మార్కులకు జరిగే నీట్‌లో సగభాగం బయాలజీదే. దీనిలో సాధారణంగా చదివే విద్యార్థి జాగ్రత్త వహిస్తే 300కుపైగా మార్కులను సాధించుకోవచ్చు. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలకు మాత్రమే పరిమితమైనా 320కుపైగా సాధించుకునే అవకాశం ఉంటుంది.



**పీవీఆర్‌కే మూర్తి**
శ్రీ గాయత్రి విద్యాసంస్థలు

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదువుతూ ముఖ్యాంశాలను పాఠ్య పుస్తకంలోనే అండర్‌లైన్ చేసుకోవాలి. తరువాత సీబీఎస్ఈ బోర్డు ప్రశ్నలను చదివితే ప్రశ్నపత్రంలో ఎలాంటి ప్రశ్నలకు ప్రాధాన్యం ఉంటుందో అవగతమవుతుంది. తెలుగు రాష్ట్ర విద్యార్థులు ఇంత వరకూ ఎంసెట్‌కు అలవాటుపడ్డారు కాబట్టి సీబీఎస్ఈ ప్రశ్నలను చూడటం తప్పనిసరి. అందుకే తెలుగు రాష్ట్రాల బయాలజీ పుస్తకం కంటే ఉత్తర భారతదేశ పుస్తకాలను ఎంచుకుంటే సీబీఎస్ఈ వారు ఎలాంటి ప్రశ్నలు ఇస్తున్నారో అర్థమవుతుంది. మన రాష్ట్రాల్లో చాలావరకు పాత ఎంసెట్ మెటీరియల్‌కు అట్టతీసి నీట్ పుస్తకంగా ప్రచురిస్తున్నారు. అలాకాకుండా నీట్‌ను దృష్టిలో ఉంచుకుని సీబీఎస్ఈలో అడిగే ప్రశ్నల విధానంపై అవగాహన పెంచే పుస్తకాలకు మాత్రమే ప్రాధాన్యమిచ్చి చదవాలి.

బయాలజీలో వివిధ చాప్టర్ల వెయిటేజీ గత సంవత్సరాల్లో కింది విధంగా ఉంది. ఈ ఏడాది కూడా స్వల్ప మార్పులతో అదే కొనసాగవచ్చు.

| అంశం | వెయిటేజీ |
|---|---|
| హ్యూమన్ ఫిజియాలజీ | 17% |
| డైవర్సిటీ ఇన్ ద లివింగ్ వరల్డ్ | 14% |
| జెనెటిక్స్ అండ్ ఎవల్యూషన్ | 11% |
| బయోటెక్నాలజీ & ఇట్స్ అప్లికేషన్స్ | 11% |
| బయాలజీ అండ్ హ్యూమన్ వెల్ఫేర్ | 9% |
| స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్ ఇన్ ప్లాంట్స్ అండ్ యానిమల్స్ | 9% |
| రిప్రొడక్షన్ | 9% |
| సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్స్ | 7% |
| ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ | 7% |
| ప్లాంట్ ఫిజియాలజీ | 6% |

### నీట్ బయాలజీ పునశ్చరణలో జాగ్రత్తలు

- బొమ్మలను లేబుల్స్‌తో అర్థం చేసుకోవడం, గుర్తుంచుకోవడం.
- పరీక్షల్లో ఎక్కువగా అడిగే ప్రశ్నలను ఒక దగ్గర రాసుకోవడం.
- ఎక్కువగా మర్చిపోయే అంశాలను ఒక దగ్గర రాసుకోవడం.
- బహుళైచ్ఛిక ప్రశ్నలను వీలైనన్ని ఎక్కువగా అభ్యాసం చేయడం.
- ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాన్ని మొదటి నుంచి చివరి వరకు క్షుణ్ణంగా చదవడం.

సమయం తక్కువగా ఉంది. కాబట్టి సులభంగా మార్కులు సాధించే అంశాలకే ఎక్కువ సమయాన్ని కేటాయించడం మేలు. చదివే సమయంలో కనీసం 50% కాలాన్ని బయాలజీకి ఇవ్వగలిగితే ఎక్కువ లాభం చేకూరుతుంది.

## రసాయనశాస్త్రం.. ప్రశ్నల్లో తేడా

దీని మూడు విభాగాల్లో విద్యార్థి తయారీ విధానంలో స్వల్ప మార్పు ఉండాలి. అంటే భౌతిక, అకర్బన, కర్బన రసాయన శాస్త్రాలకు ఒకే పద్ధతిని పాటించడం సరి కాదు.

అకర్బన రసాయన శాస్త్రంలో సిద్ధాంతపరమైన ప్రశ్నలుంటాయి. కాబట్టి సన్నద్ధమయేటపుడు దీన్ని చివరకు మిగులుస్తారు. ఇది చాలా తప్పు. ఇప్పటి నుంచే సరైన ప్రణాళికతో గ్రూపులకు సంబంధించి టేబుల్స్ చేసుకుంటూ వెళితే గుర్తుంచుకోవడం సులభమవుతుంది.

భౌతిక రసాయన శాస్త్రంలో కొన్ని ఫార్ములాలు గుర్తుంచుకోవాలి. లెక్కించడం త్వరగా చేయడం అభ్యసించాలి. జవాబుల్లో అంతరం ఉంటుంది కాబట్టి మొదట లెక్కించేటప్పుడు సుమారుగా చూసుకుని దగ్గర సంఖ్యకు వెళ్లవచ్చు.

**ఉదాహరణకు–** 9.8 × 4 ఉంది అనుకుందాం. దానిని 10 × 4గా తీసుకుని 40 కంటే కొద్దిగా తక్కువగా ఉన్న జవాబు ఏది ఉందో గమనిస్తే.. మిగిలినవి దూరంగా ఉంటే ఆ జవాబును వెంటనే గుర్తించవచ్చు. ఇటువంటి అభ్యాసం ఇప్పటినుంచే చేయాలి. ఈ సమయంలో రాని ప్రశ్నలకు ఎక్కువ సమయాన్ని వృథా చేసుకోకుండా వచ్చినవాటిని పునశ్చరణ చేసుకుంటే తుది పరీక్షలో వాడి, కచ్చితత్వం పెరుగుతాయి.

కర్బన రసాయన శాస్త్రంలో మెకానిజం మీద ప్రశ్నలు ఇస్తున్నారు. ఎక్కువమంది విద్యార్థులు వాటిలోనే ఎక్కువ తప్పులు చేస్తున్నారు. ఈ చర్యల్లో రియేజంట్ ప్రాముఖ్యాన్ని సరిగా అర్థం చేసుకుంటే సులభంగా జవాబును గుర్తించవచ్చు.

### నీట్ కెమిస్ట్రీ పునశ్చరణలో జాగ్రత్తలు

- గ్రూపులు, వాటి ధర్మాలకు సంబంధించి టేబుల్స్ తయారు చేసుకుని ప్రతిరోజూ ఒకసారి చదవాలి.
- ఆక్సిడైజింగ్, రెడ్యూసింగ్ ఏజెంట్స్ గురించి విడివిడిగా నోట్స్ తయారు చేసుకోవాలి.
- ఆర్గానిక్ రియాక్షన్స్‌ను వీలైనన్ని ఎక్కువసార్లు పేపర్ మీద సాధన చేయాలి.
- నీట్ సంబంధిత పుస్తకాల్లోని బహుళైచ్ఛిక ప్రశ్నలను మాత్రమే ఎక్కువగా తయారు చేసుకోవాలి.
- పరీక్షను 45 నిమిషాల వ్యవధిలో పూర్తిచేసేలా అభ్యాసం అలవరచుకోవాలి.

| అంశం | వెయిటేజీ |
|---|---|
| అకర్బన రసాయన శాస్త్రం (ఇనార్గానిక్ కెమిస్ట్రీ) | 36% |
| భౌతిక రసాయన శాస్త్రం (ఫిజికల్ కెమిస్ట్రీ) | 36% |
| కర్బన రసాయన శాస్త్రం (ఆర్గానిక్ కెమిస్ట్రీ) | 28% |

## భౌతికశాస్త్రం... పట్టున్నవి పునశ్చరణ

భౌతికశాస్త్రంపై ఇప్పటికే పట్టు ఏర్పరచుకుని ఉండాలి. కానీ ఎక్కువ శాతం విద్యార్థులు ఈ సమయంలో భౌతిక శాస్త్రానికి ఎక్కువ సమయాన్ని వెచ్చించి చివరికి పూర్తిగా నష్టపోతున్నారు.

పోటీపరీక్షల్లో విద్యార్థి మానసిక స్థితి చాలా ప్రభావం చూపుతుంది. భౌతికశాస్త్రంపై భయంతో ఎక్కువ సమయం వెచ్చించేకొద్దీ విద్యార్థి తనపై ఆత్మవిశ్వాసం కోల్పోయి తుది పరీక్షలో అధ్వానస్థితికి పోయే ప్రమాదముంది. అందుకే ఈ తక్కువ సమయంలో ఏ అంశాలపై పట్టు ఉందో వాటికే ఎక్కువ సమయం కేటాయించాలి. వాటినే రెండు, మూడుసార్లు పునశ్చరణ చేసుకోవాలి. ఇలా ఆత్మవిశ్వాసంతో ఎక్కువ మార్కులు సాధించే అవకాశం ఏర్పడుతుంది.

విద్యార్థికి ప్రథమ సంవత్సర సిలబస్‌పై బాగా పట్టు ఉంటే మెకానిక్స్‌కి తోడుగా మోడర్న్ ఫిజిక్స్‌ని.. ద్వితీయ సంవత్సర సిలబస్‌పై పట్టు బాగా ఉంటే ఎలక్ట్రిసిటీకి తోడుగా మోడర్న్ ఫిజిక్స్‌ని బాగా అభ్యాసం చేయాలి. దీనివల్ల 45 ప్రశ్నల్లో 30కిపైగా జవాబులను తప్పకుండా గుర్తించే వీలవుతుంది. అవగాహనతో ఈ విధంగా సిద్ధమైన ఏ విద్యార్థి అయినా సులభంగా 600/720 పైగా మార్కులు తెచ్చుకోవచ్చు!

| అంశం | వెయిటేజీ |
|---|---|
| మెకానిక్స్ | 24% |
| ఎలక్ట్రో డైనమిక్స్ | 24% |
| మోడర్న్ ఫిజిక్స్ | 20% |
| హీట్ అండ్ థర్మోడైనమిక్స్ | 13% |
| ఎస్‌హెచ్‌ఎం అండ్ వేవ్స్ | 7% |
| ఆప్టిక్స్ | 7% |
| ప్రాపర్టీస్ ఆఫ్ మ్యాటర్ | 5% |

# సాధనలో మునిగి... ర్యాంకర్‌గా తేలాడు!

**గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్... గేట్! పరీక్ష చూస్తే...అఖిలభారత స్థాయి. దానికి సిద్ధమయ్యే తీరు మామూలుగా ఉంటే సరిపోతుందా? అది అత్యంత ఇష్టమైన వ్యాపకంగా సాగాలి. సమయం ఎలా ముగుస్తుందో కూడా తెలియనంతగా సాధనలో మునిగిపోవాలి. అలా చేశాడు కాబట్టే భువన్‌చంద్ర ఆలిండియా టాపర్‌గా నిలిచాడు. గేట్-2018 ఫలితాల్లో ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో ప్రథమ ర్యాంకర్‌గా నిలిచిన ఈ విద్యార్థి తన విజయరహస్యాలు ఇలా చెపుతున్నాడు...**

"మొదటి ప్రయత్నంలో ర్యాంకు సాధించలేకపోయాను. బీటెక్ ప్రాజెక్టు వర్క్స్ కారణంగా గేట్‌పై అప్పుడు దృష్టిసారించలేకపోయాను. అందుకే 324 ర్యాంకు వచ్చింది. ఎలాగైనా మంచి ర్యాంకు సాధించాలి.. ఇస్రో, డీఆర్‌డీవో లాంటి సంస్థల్లో చేరాలనే లక్ష్యంతో గత ఏడాది జులై నుంచి చెన్నైలోని ఓ ఇన్‌స్టిట్యూట్లో శిక్షణ తీసుకోవటం ప్రారంభించాను.

డిసెంబరు వరకూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు చదవడం, ప్రాక్టీస్ చేయడం.. ప్రతిరోజూ ఇదే దినచర్య. జనవరి నుంచి ఫిబ్రవరిలో 3వ తేదీ పరీక్ష రాసేవరకూ రాత్రి 11 గంటల వరకు చదువు సాగించాను. ముగ్గురు మిత్రులం కలిసి చేసిన కంబైన్డ్ స్టడీస్ కలిసి వచ్చింది. అంశాలపై చర్చించుకోవడం, ప్రాబ్లమ్స్ సాల్వ్ చేసుకోవడం చేశాం. ర్యాంకు సాధించాలనే ధ్యాసతో ముందుకుసాగాను.

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కోచింగ్ తరగతులకు హాజరు.. తర్వాత ఒక అర్ధగంట భోజనానికి. ఆపై ఇన్‌స్టిట్యూట్‌లోనే కూర్చుని ప్రాబ్లమ్స్‌పై శ్రద్ధపెట్టాను. రాత్రి వరకు అక్కడే ఉండేవాడిని. రాత్రికి గదికి వచ్చిన తర్వాత 11 గంటల వరకు స్నేహితులతో కలిసి మళ్ళీ సాధన.

**గేట్ టాపర్ గెలుపు బాట**

### మొదట 80 మార్కులే..

గేట్ ఫలితాల్లో మొదట 80 మార్కులే వచ్చాయి. 3 ప్రశ్నలను ఛాలెంజ్ చేయగా రెండింటికి అందరికీ మార్కులు వచ్చాయి. ఒక ప్రశ్నకు సంబంధించి నా ఒక్కడికే మార్కులు కలిశాయి. దీంతో అదనంగా ఆరు మార్కులు వచ్చాయి. 86.67 మార్కులు రావడంతో మొదటి ర్యాంకు లభించింది. గేట్ స్కోరు 1000 వచ్చింది.

డిసెంబరు నుంచి ప్రాక్టీస్‌కు మరింత ఎక్కువ సమయం కేటాయించాను. జనవరి నెల ఎలా వచ్చి వెళ్లిపోయిందో నాకసలు గుర్తే లేదు. డిసెంబరు నెలకు సిలబస్‌ను పూర్తి చేసి, జనవరి నుంచి మాక్ టెస్టులు రాశాను. మొత్తం 8 మాక్‌టెస్టులు రాయగా ఐదింటిలో నేనే మొదటి స్థానంలో నిలిచాను. ఎంత బాగా చదివినా పునశ్చరణ (రివిజన్) అనేది ఉండాలి. గతంలో వచ్చిన ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. ఏ స్థాయిలో ప్రశ్నలు వస్తున్నాయి, ఎలా బురిడీ కొట్టిస్తున్నారు అనేవి పాత పేపర్‌లను చూసి, విశ్లేషించుకోవాలి. దీనివల్ల ప్రశ్నలు ఎంత లోతుగా అడుగుతున్నారో తెలుస్తుంది. 2007 నుంచి గేట్‌లో ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో ఇచ్చిన ప్రతి ప్రశ్నపత్రాన్నీ సాధన చేశాను.

### ఇలా లక్ష్యం చేరుకోవచ్చు..

ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగంలో గేట్ గత ఏడాది దాదాపు 5 వేల మంది రాశారు. ఒకసారి సిలబస్ పూర్తి చేసిన తర్వాత రివిజన్ చాలా ప్రధానం. సిలబస్ సముద్రంలాగా ఉంటుంది. దీంతో విద్యార్థులు కంగారుపడిపోతారు. ఇన్‌స్టిట్యూట్‌లో నేర్చుకోవడమే కాకుండా ప్రాక్టీస్ అనేది చాలా ముఖ్యం. ఒక్కో టాపిక్‌ను విడదీసి సిద్ధం కావాలి. ప్రశ్న పైకి తేలికగా కనిపిస్తుంది. దీంతో ఆ ఉత్సుకతలో ఏదో ఒక చిన్న తప్పు చేసేస్తారు. ఏం ఇచ్చారు.. ఏం అడుగుతున్నారు అన్నదాన్ని చూసుకోవాలి.

65 ప్రశ్నలకు 180 నిమిషాలు మాత్రమే సమయం ఉంటుంది. ముందుగా తేలికగా ఉన్న ప్రశ్నలను చేసుకుంటూ పోవాలి. ఏదైనా కఠినమైన ప్రశ్న ఉంటే దానికి ఐదు నిమిషాల కంటే ఎక్కువ సమయం కేటాయించకూడదు. ఇలాంటి వాటికి పేపర్ మొత్తం పూర్తయిన తర్వాత ఇంకా సమయం ఉంటే అప్పుడు మళ్ళీ వీటిపై దృష్టి సారించాలి.



**పునుకోలు భువన్‌చంద్ర**
**తల్లిదండ్రులు:** సుబ్బారావు, రోజారాణి
**స్వస్థలం:** కృష్ణా జిల్లా హనుమాన్‌జంక్షన్ మండలం తిప్పనగుంట
**నివాసం:** విజయవాడ
**జేఈఈ అడ్వాన్స్‌డ్:** 2224 ర్యాంకు (2013)
**బీటెక్:** ఏరోస్పేస్ ఇంజినీరింగ్ (ఐఐటీ మద్రాస్)

నాకు నాలుగు ప్రశ్నలు కఠినంగా అనిపించడంతో వీటికి ఐదు నుంచి ఆరు నిమిషాల సమయం కేటాయించాను. మొదటిసారి రాసిన గేట్ పరీక్ష ద్వారా తార్కిక ప్రశ్నలను ఎలా ఎదుర్కోవాలో తెలిసింది. శిక్షణ కోసం ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్లి, వచ్చిపోవడం కాకుండా.. సాధన బాగా చేయాలి. ఏరోజుకారోజు ప్రాబ్లమ్స్ సాధన చేస్తూ ఉండాలి. దీంతో ఎక్కడ తప్పులు చేస్తున్నామో తెలుస్తుంది. పరీక్షల ముందు సమయంలో ఒత్తిడికి గురికాకూడదు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం నాకు ఆదర్శం. డీఆర్‌డీవో, ఇస్రోల్లో చేరి పరిశోధనలు చేయాలని అనుకుంటున్నాను. ప్రస్తుతం వచ్చిన ర్యాంకుతో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ)లో చేరాలని అనుకుంటున్నాను".

– మాసిని శ్రీనివాసరావు, ఈనాడు-అమరావతి

## నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

**వెటర్నరీ యూనివర్సిటీలో 183 టీచింగ్ పోస్టులు**

**నియామక వర్సిటీ:** పి.వి.నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ, హైదరాబాద్.
**పోస్టులు:** అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్
**ఖాళీలు:** బ్యాక్‌లాగ్-83, రెగ్యులర్-100
**విభాగాలు:** వెటర్నరీ సైన్స్, డెయిరీ సైన్స్, ఫిషరీ సైన్స్, ఫిజికల్ సైన్స్, అగ్రికల్చరల్ సైన్సెస్, లైబ్రరీ సైన్స్.
**అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ, పీజీ, నెట్/ స్లెట్/ సెట్/ పీహెచ్‌డీతోపాటు బోధన/ పరిశోధన రంగంలో అనుభవం.
**ఎంపిక:** వర్సిటీ నిబంధనల ప్రకారం.
**దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్
**రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.1000
**చివరితేది:** 10.04.2018
**వెబ్‌సైట్:** http://tsvu.nic.in/

**హెచ్‌ఎల్‌ఎల్-హైట్స్‌లో 113 ఖాళీలు**

**సంస్థ:** భారత ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన హెచ్‌ఎల్‌ఎల్ ఇన్‌ఫ్రాటెక్ సర్వీసెస్ లిమిటెడ్ (హైట్స్), నోయిడా.
**పోస్టులు:** సీనియర్ మేనేజర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఇంజినీర్ తదితరాలు.
**అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్/ ఎంఈ/ ఎంటెక్, బీఆర్క్, ఇంజినీరింగ్ డిప్లొమా, ఇతర అర్హతలు.
**వయసు:** పోస్టును అనుసరించి గరిష్ఠంగా 55 ఏళ్లకు మించకూడదు.
**ఎంపిక:** రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ద్వారా.
**దరఖాస్తు:** ఆఫ్‌లైన్.
**చివరితేది:** 01.04.2018
**వెబ్‌సైట్:** http://www.hllhites.com/careers/

### ప్రవేశాలు

**ఏపీపీఈసెట్-2018**

ఆంధ్రప్రదేశ్‌లోని వర్సిటీలు, అనుబంధ కళాశాలల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి తరపున ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఈ సెట్‌ను నిర్వహిస్తోంది.
**కోర్సులు:** బీపీఈడీ, యూజీడీపీఈడీ
**కాలవ్యవధి:** 2 సంవత్సరాలు
**అర్హత:** డీపీఈడీ కోర్సులకు ఇంటర్, బీపీఈడీ కోర్సులకు డిగ్రీ.
**ఎంపిక:** పీఈసెట్ ద్వారా.
**పరీక్ష తేది:** 04.05.2018 నుంచి
**దరఖాస్తు ఫీజు:** రూ.850
**ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** 22.03.2018
**వెబ్‌సైట్:** http://sche.ap.gov.in/

### ఫెలోషిప్స్ అండ్ స్కాలర్‌షిప్స్

**యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్**

**పోస్టులు–ఖాళీలు:** జేఆర్ఎఫ్-01, ప్రాజెక్ట్ అసోసియేట్-04, రిసెర్చ్ అసోసియేట్-01.
**అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీతోపాటు నెట్/ గేట్/ బీఈటీ/ పీహెచ్‌డీ ఉత్తీర్ణత.
**ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా.
**దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్
**చివరితేది:** 06.04.2018
**వెబ్‌సైట్:** https://www.uohyd.ac.in/

**ఏపీ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్-2018**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామక అర్హతకు నిర్వహించే పరీక్ష. ఆంధ్రా యూనివర్సిటీ ఈ టెస్టును నిర్వహిస్తోంది.
**అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ ఉత్తీర్ణత.
**ఎంపిక:** స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సెట్) ద్వారా.
**పరీక్ష తేది:** 01.07.2018
**పరీక్షా కేంద్రాలు:** విశాఖపట్నం, రాజమహేంద్రవరం, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, తిరుపతి.
**దరఖాస్తు ఫీజు:** రూ.1000
**ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** 26.03.2018
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** 02.05.2018 (అపరాధ రుసుముతో జూన్ 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు)
**వెబ్‌సైట్:** https://apset.net.in/

**పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.**